విశాలాంధ్ర

ప్రకాశం బాపట్ల

ఆదివారం 18 ఆగస్టు 2024 8 పేజీలు

వైద్య సేవలు బంద్ విజయవంతం

- జిల్లా వ్యాప్తంగా మూతపడ్డ హాస్పిటల్స్
- కలకత్తా ఘటన వైద్య బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి
- ఒంగోలులో భారీ ర్యాలీ, మనవహారం
- డాక్టర్ల నిరసనకు మద్దతు తెలిపిన ఎమ్మెల్యే దామచర్ల

విశాలాంధ్ర- ఒంగోలు: వైద్యులకు రక్షణ చట్టాలు తీసుకురావాలంటూ, కలకత్తా ఘటనలో జరిగిన బాధ్యత డాక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా ఐఎంఏ ఇచ్చిన పిలుపు మేరకు వైద్య సేవలు బంద్ కార్యక్రమం శనివారం విజయవంతం చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు వైద్యశాలలు మూతపడ్డాయి. సాధారణ చికిత్సలు వైద్యులు నిర్వహించలేదు. కేవలం ఎమర్జెన్సీ కేసులు మాత్రమే చూడటం జరిగింది. ఒంగోలులోని రిమ్స్ హాస్పిటల్ జూనియర్ డాక్టర్లు నిరసన జరిపారు. రిమ్స్ హాస్పిటల్ నుండి ఒంగోలు చర్చి సెంటర్ వరకు వైద్య విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చి సెంటర్లో మానవహారం నిర్మించి

తన నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు మాట్లాడుతూ దేశంలో వైద్యులకు, వైద్యశాలలకు రక్షణ కరువైందన్నారు. కలకత్తాలో ప్రభుత్వ వైద్యురాలిపై అత్యాచారం చేయడమే కాకుండా హత్య చేసిన వారిని ఇప్పటివరకు గుర్తించకపోవడం, పట్టుకోకపోవడం దేశంలో డాక్టర్ల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిని తెలియజేస్తుందని మండిపడ్డారు. 24 గంటల పాటు ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న వైద్యులకే రక్షణ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెలిసి వైద్యులు, వైద్యశాలల రక్షణ కోసం కఠినమైన రక్షణ చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థుల నిరసన కార్యక్రమానికి మద్దతు పలికిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు మాట్లాడుతూ కలకత్తాలో చోటుచేసుకున్న ఘటన మానవాళి సిగ్గుపడాల్సిన విషయం అన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

19న భూ బాధితులతో కలెక్టర్‌కు వినతులు

సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలలో భూ అక్రమాలు, కబ్జాలు, దందాల వల్ల భూములు కోల్పోయిన బాధితులను సమీకరించి ఈ నెల 19వ తేదీన జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేయాలని సీపీఐ రాష్ట్ర పిలుపు మేరకు జిల్లా పార్టీ నేతలు సమయాత్తం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ పిలుపునిచ్చారు. సింగరకొండ మాట్లాడుతూ గత ప్రభుత్వం భూ ఆక్రమణలు, అక్రమాలు కబ్జాలు, దందాలు అధిక శాతం జరిగాయని తెలిపారు. ఈ నేపథ్యంలో బాధితుల పక్షన నిలవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కలెక్టరఃకు వినతిపత్రాలు సమర్పించి బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా భూ బాధితుల రాష్ట్ర సదస్సు ఈ నెల 28వ తేదీన విజయవాడ, దాసరి భవన్ లో జరుగుతుందన్నారు. జిల్లాలలోని భూ బాధితుల చేత ముఖ్యమంత్రికి వినతి పత్రాలు అందించనున్నట్లు తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో జరిగిన భూ పోరాటాల ద్వారా పేదల స్వాధీనంలో ఉన్న భూములు, ఇళ్లస్థలాలకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ పేదల సంతకాలతో అర్జీలు తయారు చేయించి రాష్ట్ర సదస్సుకు హాజరుకవాలని సింగరకొండ తెలిపారు.

ప్రమాదాలు నివారణే లక్ష్యం

- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

విశాలాంధ్ర - అద్దంకి : విద్యుత్ శాఖ అధికారులతో విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవి కుమార్ శనివారం వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు.రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ షాక్‌తో చనిపోయిన వారి వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు.గతంలో కాకుండా ప్రాణ నష్టాన్ని తగ్గించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఇప్పటి వరకు విద్యుత్ షాక్‌తో చనిపోయిన వారు ఎలా మరణించారో రిపోర్టు తయారు చేయాలని పేర్కొన్నారు.అధిక ప్రాణ నష్టం ఏ విధంగా జరుగుతుందో అంచనా వేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.భూమి దగ్గర వేలాడుతున్న వైర్ల కారణంగా కూడా విద్యుత్ షాక్‌తో ప్రజలు,సిబ్బంది చనిపోతున్నట్లు తన దృష్టికి వచ్చిందని మంత్రి అధికారులకు వివరించారు.రాష్ట్ర వ్యాప్తంగా వేలా డుతున్న విద్యుత్ వైర్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని 2లో

భూ బాధితులకు అండగా సీపీఐ

- సిట్ కేసులను వేగవంతం చేయాలి
- భూ బాధితులకు వెంటనే భూమిని స్వాధీనం చేయాలి
- నకిలీ స్టాంపు కుంభకోణం నిందితులను వెంటనే అరెస్టు చేయాలి
- ఈనెల 19న సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరుకు వినతిపత్రం
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ

విశాలాంధ్ర-ఒంగోలు: జిల్లాలో భూ కబ్జాలకు గురై, నకిలీ స్టాంపులకు కుంభకోణంలోని బాధితులకు సీపీఐ అండగా నిలుస్తుందని సీపీఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ కాలంలో జిల్లాలో భూ అక్రమంలో యధేచ్ఛగా కొనసాగాయని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూములు కూడా రక్షణ కరువైందన్నారు. నాటి అధికార పార్టీ అండదండలతో భూకబ్జాదాకులు చెలరేగిపోయారన్నారు. 22 ఏ భూములకు తమకు అనుకూలంగా రిజిస్ట్రేషన్ అనుమతులు సాధించు కుని డీకే భూములను కూడా యధేచ్ఛగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమతో పాటు, జిల్లాలోని 18 మండలాలను ఈ తంతు కొనసాగినట్లు ప్రభుత్వం పేర్కొందన్నారు.ఈ నేపథ్యంలో ఒంగోలు, మార్కాపురం, కనిగిరిలలో నాటి రాష్ట్ర ప్రభుత్వం సిట్ వేసింది అన్నారు. ఒంగోలులో కొంతమేర పని జరిగినప్పటికీ, మార్కాపురం, కనిగిరి ప్రాంతాలలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సామెత చిట్ దర్యాప్తు నడిచింది అన్నారు. జిల్లాలో ఒక బాధితులకు కూడా న్యాయం జరగలేదన్నారు. ఒకరికి భూమిని స్వాధీన పరచలేదన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 19న జిల్లాలోని భూ బాధితులతో కలిసి సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టర్కు వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని భూ బాధితులు విలువగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అందుబాటులో లేని ఇసుక

2 లో ...

అంతర్ జిల్లాల దొంగలు అరెస్టు

- రూ.16,99,700 విలువ గల వస్తువులు స్వాధీనం
- సీసీఎస్ పోలీసులను అభినందించిన ఎస్పీ తుషార్ డూడీ

విశాలాంధ్ర - బాపట్ల : జల్సాలకు అలవాటు పడి గత మూడు నెలలుగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లాల దొంగలను బాపట్ల జిల్లా పోలీసులు ఎట్టికేలకు అరెస్టు చేసి జైలుకు పంపారు. బాపట్ల సీసీఎస్ పోలీస్ స్టేషన్ వద్ద ఎస్పీ తుషార్ డూడీ శనివారం మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కారంపూడి విజయ కుమార్,తాడిపత్రి సాయి,చెరుకుపల్లి మండలం రాజోలు(గామానికి చెందిన బండికట్ల పవన్ కళ్యాణ్ అనే ముగ్గురు ముద్దాయిలు గత మూడు నెలలు నుంచి దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇటీవల రేపల్లె సబ్ డివిజన్ పరిధిలో ఉన్న దేవాలయాలలో దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడించారు.ముద్దాయిలను శనివారం మధ్యాహ్నం చుండూరు మండలం ఆళ్ళపాడు గ్రామం వంతెన వద్ద పోలీసు అధికారులు అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేయటం జరిగిందన్నారు.ఈ ముద్దాయిలపై గతంలో గుంటూరు, విజయవాడ,తెనాలి,పల్నాడు జిల్లాలో కూడా కేసులు ఉన్నాయని తెలిపారు.బాపట్ల సీసీఎస్ షోలీసుస్టేషన్ డిఎస్సీ పి.జగదీష్ నాయక్ పర్యవేక్షణలో సీసీఎస్ సీఐ పి.ప్రేమయ్య, చుండూరు సర్కిల్ సీఐ సిహెచ్‌ఎల్ఎన్ శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేక ˇబృందాలను ఏర్పాటు చేసి ముద్దాయలను పట్టుకోవటం జరిగిందన్నారు. ముద్దాయిల వద్ద నుండి రూ. 6.09 లక్షల విలువల గల వెండి రూ. 10.55 లక్షల విలువ గల 10 బైక్లు, రూ.35వేలు విలువ గల స్మార్ట్ టివి మొత్తం రూ.16,99,700లను స్వాధీనం చేసుకోవటం జరిగిందని ఎస్పీ తెలిపారు.వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. కేసును దర్యాప్తులో ప్రతిభ చూపిన సీసీఎస్ సీఐ పి.ప్రేమయ్యలను ఎస్పీ అభినందించారు.

అంతర్ జిల్లాల దొంగలు అరెస్టు

మొదటి పేజీ తరువాయి

అధికారులకు సూచించారు.ప్రజలు ఇబ్బంది పడుతున్న సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి,తగిన చర్యలు చేపట్టాలని చెప్పారు.విద్యుత్ లైన్ల మరమత్తులపై ప్రత్యేకంగా దృష్టి సారించి త్వరితగతిన వాటిని పూర్తి చేయాలని వివరించారు.తదుపరి సమీక్ష నాటికి అధికారులందరు పూర్తి సమాచారంతో రావాలని ఆదేశించారు.ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినప్పుడు సమస్యను తక్షణనే పరిష్కారానికి చొరవ చూపాలని,అలాకాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.విద్యుత్ షాక్‌తో చనిపోయిన వారికి నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవడం తమ ప్రభుత్వ విధానం కాదని,అసలు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకునే ప్రభుత్వమని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు.తమ ప్రభుత్వం నష్టపోయిన ప్రతీ కుటుంబానికి న్యాయం చేస్తుందని పేర్కొన్నారు

మౌనిత దేవానాధ్‌పై దాడి నిరసనగా ర్యాలీ

విశాలాంధ్ర-సింగరాయకొండ : కలకత్తా జూనియర్ డాక్టర్ మౌమిత దేవనాథ్ పై జరిగిన దారుణ ఘటన పై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సింగరాయకొండలో వైద్యసిబ్బంది, ప్రజా సంఘాల నాయకులు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా వైద్యులు ఉజ్వల మాట్లాడుతూ అత్యవసర సమయంలో ప్రజలకు ప్రాణం పోసే మాకే రక్షణ లేకపోతే డ్యూటీ ఎలా చేయాలని ప్రశ్నించారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా మహిళలపై, చిన్నారులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ పనిచేసే చోట మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. పట్టణంలో ఉన్నత పాఠశాల విద్యార్థినిలతో కందుకూరు రోడ్డు నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీతో పాటుగా మానవహారం నిర్వహించారు.మాకురక్షణ కావాలి, బాధిత మహిళలకు న్యాయం చేయాలి అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు సయ్యద్ జిలాని భాష, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ వీరేంద్ర కుమార్, డాక్టర్ చైతన్య కృష్ణ,డాక్టర్ హరిబాబు, డాక్టర్ రాకేష్ డాక్టర్ లీనా రాఫెల్,మరియు న్యాయ సేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు పాల్గొనగా పోలీసు సిబ్బంది ట్రాఫిక్ నియంత్రణ చేశారు.

వైద్యులకు రక్షణ చట్టం తేవాలి

- ఐఎంఏ డిమాండ్

విశాలాంధ్ర -ఒంగోలు: వైద్య వృత్తిలో ఉన్న వారికి రక్షణ కల్పించేలా కఠినమైన చట్టాలు తీసుకురావాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఒంగోలులోని ఐఎంఏ హాలులో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ కలకత్తాలోని ఆర్జికల్ వైద్యశాలలో వైద్య వృత్తిలో ఉన్న ఎండి రెండవ సంవత్సరం విద్యార్థిని అమానుషంగా సామూహిక అత్యాచారం చేసి హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు తమ రాజకీయలబ్ధి కోసం కలకత్తా ఘటనను రాజకీయం చేస్తున్నాయని మండిపడ్డారు. తప్పుతా వైద్యులదే అన్న తీరుగా రాజకీయ పార్టీలు మాట్లాడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఈ ఘటనపై సిబిఐ ఎంక్వయిరీ చేయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ జాలాది మణిబాబు, ఐఎంఏ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు డాక్టర్ రావిపాటి జయ శేఖర్, డాక్టర్ మాల్యాద్రి నాయుడు, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్, డాక్టర్ మధు కిరణ్ రెడ్డి, డాక్టర్ హిమబిందు, డాక్టర్ రాధిక, డాక్టర్ సరోజినీ, డాక్టర్ సోమ శేఖర్, డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ అర్చన, డాక్టర్ డేవిడ్ విలియం, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ రామారావు, డాక్టర్ నితిన్, డాక్టర్ వరుణ్ మిత్ర, డాక్టర్ శ్రీమన్నారాయణ, డాక్టర్ మానస, డాక్టర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

అందుబాటులో లేని ఇసుక

-ఆందోళనలో భవన నిర్మాణ కార్మిక రంగం

- సీపీఐ కార్యదర్శి అందె నాసరయ్య

విశాలాంధ్ర-మార్కాపురం : తాము అధికారంలోకి వస్తే ఉచిత ఇసుకను అందించి భవన నిర్మాణ రంగాన్ని ఆదుకుంటామని ఎన్నికల ముందు పదేపదే వాగ్దానం చేసిన టీడీపీ తీరా అధికారం అనంతరం ఉచిత ఇసుక పేరుతో గత ప్రభుత్వంలో కన్న ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నారని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి అందె నాసరయ్య ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా తాపీమేస్త్రిల సంఘం సమావేశం శనివారం స్థానిక పూల సుబ్బయ్య శాంతిభవన్‌లో అధ్యక్షులు యేరువ రామిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అందె నాసరయ్య మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల కాలంలో వైసీపీ ప్రభుత్వ విధానాల ఫలితంగా భవన నిర్మాణ రంగం పూర్తిస్థాయిలో సంక్షోభంలోకి కూరుకుపోయిందని, నూతన ప్రభుత్వం వస్తే ఇసుకరేటు తగ్గుతుందని ఆశలు పెట్టుకున్న భవన నిర్మాణ కార్మికులకు నేడు నిరాశ మిగిలిందని విమర్శించారు. గతంలో కన్న ఎక్కువగానే టీడీపీ హయాంలో ఇసుక ధర ఉందని దీంతో కొనుగోలు చేయలేక భవన నిర్మాణ కార్మికులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 19వ తేది సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు జిల్లా తాపీ మేస్త్రిల సంఘం అధ్యక్షులు వై రామిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె కాశిం, తాపీమేస్త్రిల సంఘం ప్రధాన కార్యదర్శి బుజ్జి బాబు, ఉపాధ్యక్షులు పి వెంకటేశ్వర్లు, సెంట్రింగ్‌ల సంఘం నాయకులు ఎస్ జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

2047 నాటికి వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-ఒంగోలు : 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌గా ఉండాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని, ఆ లక్ష్య సాధనలో భాగంగా రానున్న 5 సంవత్సరాల కాలంలో ఏడాదికి 15 శాతం వృద్ధి సాధించే దిశగా జిల్లా ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లోని కన్ఫరెన్స్ హాల్లో జిల్లా అధికారులతో వికసిత్ ఆంధ్రా-2047, జిల్లా యాక్షన్ ప్లాన్ 2024-29 పై జిల్లా అధికారులతో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా 2047 నాటికి వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రానున్న 5 సంవత్సరాల కాలంలో ఏడాదికి 15 శాతం వృద్ధి సాధించే దిశగా జిల్లా ప్రణాళికను సిద్ధం చేయడంతో పాటు అందుకనుగుణంగా సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాల్సి ఉంటుందన్నారు. నీతిఆయోగ్ సహాయ సహకారంతో నిర్దేశిత లక్ష్యాలను నిర్ణయించుకొని అన్ని ప్రాథమిక రంగాల్లో అభివృద్ధికి 100 రోజులు, సంవత్సర ప్రణాళికలను తయారు చేయడమైనదని తెలిపారు. అదే విధంగా వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రానున్న 5 సంవత్సరాల కాలంలో ఏడాదికి 15 శాతం వృద్ధి సాధించే దిశగా లక్ష్యాలను ఏర్పరచుకొని గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రణాళికలు తయారుచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. . ఉద్యాన పంటల విస్తరణ దిశగా రైతులను ప్రోత్సహిస్తే మరింత జిడిపి వృద్ధి చెందుతుందని, అందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. తొలుత జిల్లా యాక్షన్ ప్లాన్ 2024-29 సంబంధించి తీసుకోవల్సిన అంశాలపై జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి వెంకటేశ్వర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా అధికారులకు వివరించారు. ఈ వర్క్ షాప్‌లో జడ్పి సిఈఓ మాధురి, డి.ఆర్.డి.ఎ పిడి వసుంధర, పశు సంవర్ధక శాఖ జెడి డాక్టర్ బేబి రాణి, జిల్లా ఉపాధికల్పన అధికారి బరద్వాజ్, వ్యవసాయ శాఖ జెడి శ్రీనివాస రావు, ఆర్. డబ్ల్యు.ఎస్. ఎస్ఈ మర్దన్ ఆలి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి లక్ష్మా నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే 67వ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-మార్కాపురం : ఏపియుడబ్లుజె 67వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు శనివారం పట్టణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా యునియాన్ అధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు బ్రెడ్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్ వి రమణ మాట్లాడుతూ యూనియన్ ఆవిర్భావం నుంచి నేటి వరకు 67 సంవత్సరాలుగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ రాజీలేని పోరాటాలను కొనసాగిస్తున్నదని గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మీడియాపై రాష్ట్రంలో,దేశంలో దాడులు తీవ్రతరం అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల చండీఘర్ లో జరిగిన ఇండియన్ జర్నలిస్టు యూనియన్ జాతీయ కౌన్సిల్ సమావేశం జర్నలిస్టు రక్షణ చట్టం తేవాలని ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగిందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగు స్తంభం గా వున్న మీడియా బలంగా వుంటేనే సమాజం పరివఢిల్లుతుందని అన్నారు. అలాగే అర్హత గల జర్నలిస్టులందరికీ అక్రిడేషన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు, నివాస స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య శాల సూపరింటెండెంట్ సావిత్రి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డి.మోహన్ రెడ్డి, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎస్ కె బాజివలి,ప్రెస్ క్లబ్ మాజీ ఉపాధ్యక్షులు ఎస్ కె మహబూబ్ సుభాని, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ కె అన్ను, అన్నెం శ్రీనివాసులు, వేసపోగు రాజు, నరేంద్ర ,యమ్. అది నారాయణ, ఎస్ కె బషీర్,ఎస్ రఫీ,సికిందర్, సిహెచ్ రామిరెడ్డి,బి. బాలకృష్ణ, కమిటీ సభ్యులు మల్లికార్జున, ఎస్ కె కరీం, మస్తాన్, ముకుందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఉదయం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పలువురు బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేశారు. బెస్తవారిపేట గ్రామానికి చెందిన కాలువ మణికంఠ గత సంవత్సరం సెప్టెంబర్ 22వ తేదీన ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మరణించారు. ఈ విషయం పై గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేయగా బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ. 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం మంజూరు చేశారు. సంబంధిత చెక్కును బాధితుడి సతీమణి వసుంధరకు ఎమ్మెల్యే అందచేశారు. అదే విధంగా అర్ధవీడు గ్రామంలో విద్యుత్ షాక్ కు గురై యండాల రంగస్వామికి చెందిన 2గేదెలు మృతి చెందగా వారికీ రూ. 65 వేలు చెక్కును, కాకర్ల గ్రామానికి చెందిన మహబూబ్ పీరాకు చెందిన 13 గొర్రెలు విద్యుత్ షాక్ తో మృతి చెందగా వారికీ రూ. లక్ష ముప్పై వేల రూపాయలు చెక్కును మరియు అర్ధవీడు మండలం చింతమల్లెలపాడు గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై బోగెం లింగయ్యకు చెందిన ఒక గేదె మరణించగా వారికీ రూ. 40వేల రూపాయలు చెక్కును వారికీ అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు బాధిత కుటుంబాలు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - రేపల్లె : నియోజకవర్గం పరిధిలోని మండల కేంద్రమైన నగరం శ్రీగిరిపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణ శనివారాన్ని పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.చిన పులివర్రు భజన భక్త సమాజం వారి భజన సంకీర్తన కార్యక్రమం భక్తులను అలరింప జేసినది.ఈ కార్యక్రమంలో తూనుగుంట్ల జగన్,ఎల్లాప్రగడ సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

ఆకాశాన్ని తాకిన పూల ధరలు

విశాలాంధ్ర-కొమరోలు : శ్రావణ మాసంలో వరుస శుభకార్యాలు, వరలక్ష్మీ వ్రతం కారణంగా పూల ధరలు మూడింతలు పెరిగాయి. దీనికి వాతావరణ మార్పులతో దిగుబడి తగ్గడమూ ప్రభావం చూపుతోంది. గత నెలలో మల్లెల ధర కేజీ రూ 550లు ఉండగా ఇప్పుడు రూ 1,500 పలుకుతోంది. తెల్ల చామంతి రూ 200 నుంచి రూ 350, పసుపు చామంతి రూ 150 నుంచి రూ 400, కనకాంబరం రూ 100 నుంచి రూ 300, లిల్లీ రూ 150 నుంచి రూ 500, జాజులు రూ 300 నుంచి రూ 1,200కు చేరాయి. దీంతో కొనలేక.. కొనక తప్పలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎన్నిక

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో మండల పరిషత్ ప్రైమరీ స్కూలులో విద్యా కమిటీ చైర్మన్ కానగరి రామస్వామి, వైస్ చైర్మన్ ఆర్.వెంకటేశ్వర్లు, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శ్రీనివాసులు,విద్యార్థులు, కృతజ్ఞతలు తెలిపి భవిష్యత్తులో కమిటీ సభ్యులకు స్కూలు అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ విద్యా కమిటీ చైర్మన్ లు,విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పాఠశాల కమిటీ చైర్మన్ పదవి వైసీపీ కైవసం

విశాలాంధ్ర-పెద్దారవీడు : మండలంలోని బి. చెర్లోపల్లి డిపెప్ పాఠశాల కమిటీ చైర్మన్ పదవిని వైకాపా కైవసం చేసుకుంది. హాజరైన సభ్యులందరూ వైకాపాకు జై కొట్టడంతో సునాయాసంగా చైర్మన్ పదవి చేపట్టడం జరిగింది. చైర్మన్‌గా జెడ్డా చిన్నగాలయ్య, వైస్ చైర్మన్‌గా జెడ్డా ఎలిజబెత్ రాణి, మరో నలుగురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దూదేకుల సిద్ధమ్మ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రత్న శంకర్ నాయక్ పర్యవేక్షణలో శనివారం జరిగిన ఎన్నిక ఏకగ్రీవ కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఏఎస్ఐ మంత్రుల నాయక్ సిబ్బందితో శాంతిభద్రతలను పరివేక్షించారు. ఎన్నిక కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యారవకు అభినందనలు

విశాలాంధ్ర-పామూరు : కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కాబోయే మండల టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులకు లక్ష్మీ నరసాపురం ఎంపీటీసీ బొల్లా నరసింహారావు అభినందనలు అభినందనలు తెలియజేశారు. శుక్రవారం కనిగిరిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న యారవ శ్రీనివాసులును నరసింహారావు మిత్రబృందం కలసి ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో షేక్ నాయబ్ రసూల్, ఇరి కోటిరెడ్డి, గోళ్ళ వీరబాబు, పాలపర్తి రమణయ్య, మంధ్ల మల్లికార్జున్, గుత్తి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- దొంగ నుండి రూ. 40 లక్షలు విలువైన సొత్తు స్వాధీనం
- కేసు ఛేదనలో ప్రతిభ చూపిన పోలీసు సిబ్బందిని అభినందించిన ఎస్పీ

విశాలాంధ్ర -ఒంగోలు: ఎవరూ లేని సమయంలో ఇంటిలో చోరీకి పాల్పడిన అంతర్ రాష్ట్ర దొంగను ఒంగోలు పోలీసులు స్వల్ప వ్యవధిలో పట్టుకోవడమే కాకుండా దొంగ నుండి రూ. 40 లక్షల స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ దామోదర్ పేర్కొన్నారు. వివరాల ప్రకారంఒంగోలు పట్టణంలోని కమ్మ పాలెంలోని కాకతీయ నగర్‌కు చెందిన గుమ్మడి నాగార్జునరావు తన సమీప బంధువుల వివాహం నిమిత్తం ఈనెల 9వ తేదీ రాత్రి ఎనిమిది గంటల 30 నిమిషాలకు ఒంగోలు పట్టణంలోని బచ్చల బాలయ్య కళ్యాణమండపానికి కుటుంబంతో సహా హాజరయ్యారు. అదే రోజు రాత్రి రెండు గంటల 16 నిమిషాలకు ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఇంటి తలుపులు బాధలు కొట్టి బీరువాలో, కబోర్డ్‌లో దాచిన 50 సవర్ల బంగారం నగలు,రూ. 1,80,000 నగదు, హీరో గ్లామర్ మోటార్ సైకిల్ దొంగతనానికి గురైనట్లు గుర్తించారన్నారు. దొంగిలించబడిన మొత్తం సొత్తు విలువ రూ. 40 లక్షల మీద ఉంటుందని అంచనా వేశారు. దొంగిలించిన అంబేద్కర్ కోనసీమ జిల్లా, రావులపాలెం మండలం, వేదిరేశ్వరం గ్రామానికి చెందిన పలివెల ప్రభు కుమార్ గా పోలీసులు గుర్తించారు. ప్రభు కుమార్ ను ఈనెల 16వ తేదీన ఒంగోలు పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద గల వెంకటేశ్వర లాడ్జిలో పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగాఎస్పీ మాట్లాడుతూ జిల్లా ప్రజలు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఇంటికి తాళం వేసి దూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో చుట్టుపక్కల వారికి చెప్పాలని పేర్కొన్నారు. అంత కాకుండా పోలీస్ స్టేషన్లో కూడా వివరాలు చెప్పాలని తెలిపారు. కేసును స్వల్ప కాలంలో ఛేదించిన పోలీసు బృందాన్ని ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.

తాటిచర్లలో మెగా మెడికల్ క్యాంప్ ప్రారంభం

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని తాటిచర్ల గ్రామంలోని ఆర్‌సిఎం చర్చి ఆవరణంలో బిగ్‌టీవీ మరియు కిమ్స్ హాస్పిటల్, అమ్మ ఫౌండేషన్ వార్ల సౌజన్యంతో ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంపును గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటగా పూలమొక్కను నాటి అనంతరం మెడికల్ క్యాంపును ప్రారంభించారు. కొమరోలు పరిసర ప్రాంతాలలోని ప్రజల సౌకర్యార్థం క్యాంపు ఏర్పాటు చేయటం చాలా అభినందనీయమని బిగ్ టీవీ, కిమ్స్ హాస్పిటల్, అమ్మ ఫౌండేషన్ యాజమాన్యాలకు అభినందనలు తెలియచేశారు. అశోక్ రెడ్డిని పూలమాల శాలువాతో సత్కరించారు. వృద్ధులకు, కంటి పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి వారికీ ఉచితంగా మందులు అందచేశారు. ఈ కార్యక్రమంలో బిగ్‌టీవీ, కిమ్స్ హాస్పిటల్, అమ్మ ఫౌండేషన్ సిబ్బంది, కొమరోలు మండల పార్టీ అధ్యక్షులు, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బోనేని వెంకటేశ్వర్లు, గిద్దలూరు జడ్పీటీసీ సభ్యులు బుడత మధుసూదన్ యాదవ్ గిద్దలూరు మండల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, రాష్ట్ర బీసీ నాయకులు బైలడుగు బాలయ్య, నియోజకవర్గ రైతు అధ్యక్షులు బిజ్జం రవీంద్రా రెడ్డి, బోగెం నాయుడు, రాజగోపాల్, భూపాల్, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు స్వరూపరెడ్డి, ఆర్‌సిఎం చర్చి బోధకులు, ప్రజలు పాల్గొన్నారు.

వైద్యులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : పెద్ద దోర్నాల మండలంలోని గవర్నమెంట్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు కలకత్తాలోని సీనియర్ పీజీ డాక్టర్ మీద అత్యాచారం చేసి చంపినందుకు నిరసనగా శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో డాక్టర్ సంజీవ్ మాట్లాడుతూ వైద్యుల పై దాడులు అరికట్టాలి. వైద్యురాలిని చంపిన మానవ మృగాలను వెంటనే అరెస్టు చేసి తక్షణమే ఉరిశిక్ష విధించాలి, అంతేకాకుండా వైద్యులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి. ప్రతి గవర్నమెంట్ హాస్పిటల్ లో సెక్యూరిటీ నియమించాలి అని అన్నారు .ఈ కార్యక్రమంలో డాక్టర్ లావణ్య హెడ్ నర్స్ ఎలిజిబెత్ గ ఫార్మాసిస్ట్ పిచ్చిరెడ్డి.ఆరోగ్య మిత్ర మంగళగిరి చంద్రశేఖర్. మణికుమార్. స్టాఫ్ నర్సులు. వైద్య సిబ్బంది.మరియు దోర్నాలగవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ వన్నంపల్లి మహాలక్ష్మమ్మ మరియు విద్యార్థులు సహకరించి నిరసన వ్యక్తం చేశారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర-పీసీపల్లి : ప్రయాణాలు చేసే వాహనదారులు తప్పకుండా నిబంధనలు పాటించాలని ఎస్సై టి రమేష్ బాబు అన్నారు. మండలంలోని శనివారం వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలకు సైలెన్సర్లు పెద్ద పెద్ద సౌండ్ చేస్తూ ఉంచుకూడదని వాహనాలకు నెంబర్ ప్లేట్లు కచ్చితంగా ఉంచాలని తెలియజేశారు. నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను గుర్తిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు విచ్చిన్నమవుతాయని ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే క్షేమంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీడీవో

విశాలాంధ్ర-ముండ్లమూరు : గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాలను మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఆర్ జనార్ధన్ శనివారం తెలిపారు. మండలంలోని సింగనపాలెం, ఉల్లగల్లు, వేముల గ్రామాల్లోని సచివాలయాలలో ఆధార్ నమోదు ప్రక్రియ జరుగుతుంది అన్నారు. ప్రజలు తమకు అవసరమైన అన్ని రకాల నమో దును ప్రభుత్వం నిబంధనల మేరకు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు.

మానసిక వికలాంగులకు పండ్లు,రొట్టెలు పంపిణీ

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యర్రగొండపాలెం నియోజకవర్గ ఏపీయూడబ్ల్యూజే ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సన్ జో ఆశ్రమంలో అనాథలకు, పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. యర్రగొండపాలెం నియోజకవర్గ ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షులు కాకర్ల సూర్యనరసింహామూర్తి, జిల్లా మాజీ అధ్యక్షులు షేక్ నూరిద్దీన్, జిల్లా కమిటీ సభ్యులు షేక్. మహబూబ్ బాష, తమ్మినేని అంజిరెడ్డి, నియోజకవర్గ కమిటీ సభ్యులు కటికె శంకర్, పిడికిటి వెంకటనారాయణ, గుంటి రాములు పాల్గొన్నారు.

జడ్పీటీసీ ఇందిరాకు పితృవియోగం

విశాలాంధ్ర-తర్లుపాడు : తర్లుపాడు మండల జడ్పీటీసీ వెన్నా ఇందిరా తండ్రి విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గాయం వెంకటరామిరెడ్డి (89) అనారోగ్యానికి గురై శనివారం ఒంగోలు లోని కిమ్స్ హాస్పిటల్ మృతి చెందారు. ఈయన మండలంలోని పలు ప్రాంతాల్లో జిల్లా పరిషత్తు పాఠశాలలలో ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలను నిర్వర్తించారు. ఆయనకు నలుగురు కుమార్తెలు ఉన్నారు. వారిలో వెన్నా ఇందిరా తర్లుపాడు జడ్పీటీసీ , వి హెచ్ ఆర్ విద్యా సంస్థలకు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. వెంకటరామిరెడ్డి మృతి పట్ల వైసీపీ రాష్ట్ర కార్యదర్శి హనుమారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన

విశాలాంధ్ర-దొనకొండ: జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ మరియు నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్యులు అనిల్‌కుమార్ స్థానిక వైద్యశాల మరియు జడ్‌పి ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు. ప్రధానంగా తాగునీటి వలన వచ్చు ఈ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని, దీన్ని నివారించేందుకు విటమిన్ సీ, కాల్షియం కలిగిన ఆహారాన్ని అధికంగా తీసుకోవాలంటూ సూచించారు. ఈ వ్యాధిపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని, బాధితులను గుర్తిస్తే తగు వైద్య సలహాలు, మందులు అందజేయాలని అనిల్‌కుమార్ తెలిపారు. వైద్యురాలు కె.సునీత, సీహెచ్ఓ ఇన్నాసమ్మ, జడ్‌పీ హెచ్ఎం వి.రామాంజనేయులు, ఏఎన్ఎం లీలాబాయి, టెక్నీషియన్ అంజిరెడ్డి తదితరులున్నారు.

నేటి నుండి ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

విశాలాంధ్ర-దొనకొండ: గ్రామాల్లో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ అవకతవకలు లేకుండా చేపట్టాలంటూ జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి తెలిపారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో ఆమె డిఆర్‌పీలు, విఎస్ఏలతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023 ఏప్రిల్ 1 నుండి 2024 మార్చి 31 వరకు రూ.6 కోట్ల మేర జరిగిన పనులను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలన్నారు. ఏపీఓ తగరం దేవయ్య, ఈసీ శివరామ్, ఎస్ఆర్‌పీ సురేష్, డిఆర్‌పీలు, విఎస్ఏలు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు విరాళం

విశాలాంధ్ర-రాచర్ల : రాష్ట్ర వ్యాప్తంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు పేదల ఆకలి తీర్చాలని ఈ నెల 15న అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. దానిలో భాగంగా గిద్దలూరు పట్టణంలో ఈ నెల 31న ప్రారంభించబోయే అన్న క్యాంటీన్‌కు రాచర్ల మండలానికి చెందిన సామాజిక కార్యకర్త శంకర్ నాయుడు శనివారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి 20వేల రూపాయలు వారి కార్యాలయంలో అందించారు. జనసేన నాయకులు అలిశెట్టి వెంకటేశ్వర్లు మరియు అమ్మ ఆశ్రమం నిర్వాహకురాలు తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ, పోతరాజు విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని చింతలపాలెం పంచాయతీ మోట్రావుల పాడులో జరుగుతున్న శ్రీ పోలేరమ్మ పోతరాజు విగ్రహ ప్రతిష్టలలో శనివారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దన్ రావు, కాబోయే కనిగిరి ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీనివాసులు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇరి కోటిరెడ్డి, షేక్ నాయబ్ రసూల్, దేవరపు మాల్యాద్రి తదితరులున్నారు.

హాస్టల్ విద్యార్థుల అభ్యున్నతి కోసం 'స్వీకారం'

కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-ఒంగోలు : జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుచున్న విద్యార్థుల అభ్యున్నతి కోసం "స్వీకారం" పేరుతో ఒక బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ లోని కన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ జిల్లాలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కార్యక్రమం అమలులో భాగంగా సంబంధిత శాఖల అధికారులు, వివిధ కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతో సమావేశం కావడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుచున్నదని, సామాజిక భాధ్యతతో కార్పొరేట్ సంస్థలు కూడా తమ వంతు సహకారం అందిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అందులో భాగంగా ప్రకాశం జిల్లా లోని సాంఘిక సంక్షేమ వసతి గృహములలో చదువుచున్న విద్యార్థుల అభ్యున్నతి కోసం "స్వీకారం" పేరుతో ఒక బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సామాజికం భాధ్యతతో ముందుకు వచ్చి సంక్షేమ వసతి గృహాల్లో కనీస మౌలిక వసతులు కల్పించేందుకు సాంఘీక సంక్షేమ హాస్టళ్లను దత్తత తీసుకోవాలని ఈ సందర్భంగా కార్పొరేట్ సంస్థల ప్రతినిధులను జిల్లా కలెక్టర్ కోరారు. మంచి వాతావరణంలో అణగారిన వర్గాల పిల్లలకు సంక్షేమ వసతి గృహములలో మెరుగైన విద్యను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్వీకారం కార్యక్రమం ద్వారా ఎవరైనా ఏదైనా సాంఘిక సంక్షేమ వసతిగృహములను దత్తత తీసుకొని విద్యార్థులకు అవసరమైన కిటికీలకు మెష్లు బిగించడం, మరుగుదొడ్లు మరియు బాత్రూమ్ల మరమ్మతులు, తాగునీటి కోసం ఆర్.ఓ. ప్లాంట్లు బిగించడం, భూగర్భ జలాల వినియోగానికి మోటార్లు బిగించడం, ఫ్లోరింగ్, సీలింగ్ ఫ్యాన్ల సరఫరా, లైటింగ్ సౌకర్యాలు మెరుగుపరచడం, సాంఘిక సంక్షేమ వసతిగృహములలో పచ్చదనం పెంపొందించడం, విద్యార్థులకు స్టడీ మెటీరియల్ సరఫరా, రన్నింగ్ వాటర్ కనెక్షన్ మొదలైన ప్రాథమిక సౌకర్యాలను అందించవచ్చునని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమం భవిష్యత్తు తరం ప్రభావితమవుతుంది మరియు నైతికతతో పెరుగుతుందని కలెక్టర్ వివరించారు. జిల్లాలోని 41 ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు తయారు చేయడం జరిగిందని, సామాజిక భాధ్యతతో కార్పొరేట్ సంస్థలు ముందుకు వచ్చి సాంఘిక సంక్షేమ హాస్టళ్లను దత్తత తీసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మా నాయక్, మైన్స్ డీడీ జగన్నాధ రావు, జిల్లా బి.సి. వెల్ఫేర్ అధికారి అంజన, జిల్లాలోని వివిధ గ్రానైట్ పరిశ్రమల యజమానులు, ప్రతినిధులు, హెచ్చరీస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాల సిబ్బంది నిరసన

విశాలాంధ్ర-త్రిపురాంతకం : త్రిపురాంతకం మండల కేంద్రంలో త్రిపురాంతకం మండల వైద్య సిబ్బంది నిరసన కార్యక్రమం శనివారం చేపట్టారు. ప్రభుత్వ వైద్యశాల నుండి వై పాలెం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మహిళలపై అత్యాచారాలు ఆపాలి.మహిళలను గౌరవించాలి నేరస్తులను శిక్షించాలి అంటూ నినాదాలు చేశారు.అనంతరం బస్టాండ్,వైపాలెం సెంటర్లో మానవహారం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోలకత్తాలో శిక్షణ పొందుతున్న వైద్యురాలు మౌమిత హత్యకు నిరసనగా ఈ నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు.వైద్యురాలు అయిన మౌమితను కొందరు కామాంధులు విశక్షణ రహితంగా హత్య చేయడం హేయమైన చర్య అన్నారు.ఆ వైద్యురాలు మరణానికి కారణమైన ప్రతి ఒక్కరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఏటువంటి రాజకీయాలకు తావు ఇవ్వకుండా దోషులకు శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భాస్కర్,హెచ్ వి శాంతి ఎంజెల్,సి హెచ్ ఓ లు,ఆరోగ్య కార్యకర్తలు,ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎస్ఎంసీ ఎన్నికలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలో శనివారం నిర్వహించిన ఐదు పాఠశాలల ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ఆయా పాఠశాల వద్ద గట్టి బందోబస్తు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రమే ఉండాలని ఆదేశాలు జారీ చేయడంతో, ఇతర వ్యక్తులు లోపలికి అనుమతి లేకుండా చేయడంతో ఆ ప్రాంతంలో ఎన్నికలు ప్రశాంతంగా సాగాయి. పులిపాడు తండా ఎస్ఎంసి చైర్మన్గా భూక్య కాశీ నాయక్, వైస్ చైర్మన్ మూడవత్ జమునబాయి, చిన్న ఉల్లగల్లు ఎస్ ఎంసీ చైర్మన్గా గుడిమెట్ల శిరీష, వైస్ చైర్మన్ గా తోరేటి ఆమోస్, సుంకర వారి పాలెం ఎస్ఎంసి చైర్మన్గా మీనిగా బ్రహ్మయ్య, వైస్ చైర్మన్ గా చొప్పరపు అనూష ఎన్నికయ్యారు. రెడ్డి నగర్, పలుగురాళ్ల తండా పాఠశాలలో ఎన్నిక రెండోసారి కోరం లేక ఆగిపోయాయి. ఎన్నికల సందర్భంగా ఆయా పాఠశాలలను దర్శి డిఎస్పి డి లక్ష్మీనారాయణ, దర్శి సీఐ ఎన్ రామారావు, ఎస్సై వి నాగమల్లేశ్వరరావు పర్యవేక్షించారు.

దుండగులను వెంటనే కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-పామూరు : పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కతలో జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం, హత్య చేసిన రాక్షసులను కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వ, ప్రైవేట్ డాక్టర్లు, హెల్త్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు, ఆశాలు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దేశ వ్యాప్త వైద్య సేవలు బంద్‌లో భాగంగా శనివారం వైద్య సేవలు నిలుపువేసి పట్టణంలో రాస్తారోకో, ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డాక్టర్ విజయకుమార్ ప్రైవేటు డాక్టర్స్ యూనియన్ సీనియర్ డాక్టర్ టీ. చెన్న కృష్ణ మాట్లాడుతూ దేశ ప్రజల ఆరోగ్యాలను కాపాడే డాక్టర్లకు దేశంలో రక్షణ కరువైందని, డాక్టర్లు కు భద్రత, రక్షణకు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈనెల 9న 31 సంవత్సరాల జూనియర్ డాక్టర్ అత్యాచారం హత్యకు గురైన బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకొని ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గద్దె ఏడుకొండలు, వై శ్రీనివాసులు వెంకట్ కాలే, కే సురేష్, డాక్టర్ టి రమాదేవి, దీక్షితులు మల్లికార్జున సుభాని శ్రీకాంత్ ,కార్తీక్ ,పానీ నయీమ్ ఏఎన్ఎమ్స్ ఆశాలు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ సమావేశాలు

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మండలంలోని పిడికిటి వారిపల్లి కాంప్లెక్స్ నందు గణిత సబ్జెక్ట్ పై కాంప్లెక్స్ సమావేశం మరియు ప్రైమరీ తరగతుల కాంప్లెక్స్ మరియు ముటుకుల కాంప్లెక్స్ నందు ప్రైమరీ కాంప్లెక్స్ జరిగాయని మండల విద్యాశాఖ అధికారి బి సామ్యూల్ జాన్ శనివారం తెలియజేశారు. గణిత సబ్జెక్టు కాంప్లెక్స్ నందు పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం మండలాలలోని ఉన్నత పాఠశాలలో ఉన్న గణితం బోధించే ఉపాధ్యాయులు అందరూ పాల్గొన్నారని ఎంఈఓ తెలియజేశారు. ప్రైమరీ కాంప్లెక్స్ నందు మండలంలో ఉన్నటువంటి 50శాతం ఉపాధ్యాయులు పాల్గొన్నారని తెలియజేసారు.

వైద్యులకు రక్షణ కల్పించాలని నిరసన ర్యాలీ

విశాలాంధ్ర - రేపల్లె : కలకత్తాలో జరిగిన డాక్టర్‌పై అత్యాచారానికి నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు రేపల్లెలో వైద్యులు రోడ్ల మీద నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఉదయం 6 గంటల నుండి ఆదివారం ఉదయం 6గంటల వరకు సాధారణ వైద్య సేవలు బంద్ చేస్తూ, అత్యవసర కేసులు మాత్రమే చూసే విధంగా స్థానిక ఐఎంఏ ప్రతినిధులు సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు, ఇందుకు అనుగుణంగా వైద్య సేవలు నిలిపివేసి బంద్ పాటించినట్లు ఐఎంఏ రేపల్లె బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసంతం వీరరాఘవయ్య తెలిపారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం రేపల్లె రెవిన్యూ డివిజనల్ అధికారి హేలా షారోన్‌కు, మండల తాసిల్దార్ ఎం.శ్రీనివాసరావుకు,వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ప్రతినిధులు తోపాటు స్థానిక రైతుకూలీ సంఘ నాయకురాలు శోభారాణి,ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు,రెడ్ క్రాస్ ప్రతినిధులు ప్రభాకర్ రావు,కరిముల్లా, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది,నర్సులు పాల్గొన్నారు.

వైద్యురాలిపై దురాఘతంపై నిరసన

విశాలాంధ్ర, కొల్లూరు : కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన దురాఘతాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రం కొల్లూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య, ఆరోగ్య సిబ్బంది నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి కావ్యతేజ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - చీరాల : కోల్‌కత్తాలోని ఆర్‌జికార్ మెడికల్ కాలేజి పీజీ విద్యార్థినిపై జరిగిన అత్యాచారం,హత్య అత్యంత పాశవిక చర్యని డాక్టర్ భవాని ప్రసాద్ అన్నారు. వైద్య విద్యార్థినిపై జరిగిన అమానుష అత్యాచారం,హత్యకు నిరసనగా వైద్యులు,జూనియర్ వైద్యులు శనివారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళలకు పని ప్రదేశాల్లో, కళాశాలలో రక్షణ కల్పించాలని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి మానవ మృగాలు జనారణ్యంలో తిరగకుండా కఠిన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ వైద్యులు,వైద్యులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - కర్లపాలెం : వైద్యురాలిపై జరిగిన హత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలని కర్లపాలెం పి. హెచ్.సి వైద్యులు ఎం.గోపినాధ్ డిమాండ్ చేశారు. ట్రైనీ పీజీ విద్యార్థి హత్యాచారంను ఖండిస్తూ కర్లపాలెం పి. హెచ్.సి నుంచి ఐలాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి,మానవహారంగా ఏర్పడి కొద్దిసేపు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గోపినాధ్ మాట్లాడుతూ సభ్య సమాజం తలదించుకునే విధంగా మహిళా వైద్యురాలిపై జరిగిన అత్యాచారం,హత్యను ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు సుహాన బేగం,సి. హెచ్.ఓ ఎస్.మేరిమ్మ, యు.ప్రభావతి, సూపర్వైజర్స్ ఇస్సాకు,కిషోర్, జాషువా, శేషు, ఏ.ఎన్.ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాచార ఘటనపై వైద్యుల నిరసన

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం,ఆపై హత్య జరగడం అత్యంత శోచనీయం అని ఈ దారుణమైన ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం చందోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, వైద్య సిబ్బంది నిరసన చేపట్టారు. చందోలు సెంటర్లో మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ లోకేష్,డాక్టర్ చంద్రిక, సూపర్వైజర్ నరసింహారావు,వైద్య సిబ్బంది,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రెండేళ్ళ కల నెరవేరిందిం : చైర్మన్‌గా రాంబాబు

విశాలాంధ్ర - చీరాల : ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆశీస్సులతో రెండేళ్ళ ఎస్.ఎం.సి చైర్మన్ కల నెరవేరిందని చీరాల మోడల్ స్కూల్ ఎస్ఎంసి చైర్మన్ దగ్గుబాటి రాంబాబు అన్నారు. చీరాల ఏపీ మోడల్ స్కూల్‌లో శనివారం జరిగిన ఎస్ఎంసి చైర్మన్ ఎన్నికలలో ఎన్నికల అధికారి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 15 మంది సభ్యులు పాల్గొనగా 8మంది సభ్యులు దగ్గుబాటి రాంబాబుని చైర్మన్‌గా ఎన్నుకొన్నారు. గత ఎన్నికలలో పది మంది సభ్యులతో చైర్మన్‌గా దగ్గుబాటి రాంబాబు ఎన్నికవ్వగా అప్పటి పాలకులు తమ రాజకీయ కారణాలతో కుట్ర పూరితంగా రాంబాబును తొలగించారు. నేడు ఎమ్మెల్యే కొండయ్య సారథ్యంలో టీడీపీ సీనియర్ నాయకులు గుమ్మడి ఏసురత్నం మార్గదర్శకంలో దగ్గుబాటి రాంబాబు చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా దగ్గుబాటి రాంబాబు మాట్లాడుతూ చట్టబద్ధంగా ఎస్ఎంసి ఎన్నికలు జరగడానికి అవకాశం కల్పించిన ఎమ్మెల్యే మాలకొండయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో వాటర్ సమస్య, సైకిల్ స్టాండ్, వంటి సమస్యలు వున్నాయని ఎమ్మెల్యే మాలకొండయ్య దృష్టికి సమస్యలు తీసుకెళ్ళి ఆయన ఆశీస్సులతో పరిష్కరిస్తానన్నారు. పాఠశాలలో రాజకీయ పార్టీల జోక్యం లేకుండా ఎంతో పారదర్శకంగా ఎన్నికలు జరిపిన ఎమ్మెల్యే మాలకొండయ్యకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని తాను చైర్మన్‌గా,వైస్ చైర్మన్‌గా మహమ్మద్ షాహీన్ బి ఎన్నికవ్వడానికి కృషి చేసిన ప్రతి ఒక్క ఎస్ఎంసి కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగులకు షాపులు కేటాయించాలని వినతి

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె మున్సిపాలిటీ పరిధిలో నూతనముగా నిర్మిస్తున్న రైతుబజారు, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ షాపులను దివ్యాంగులకు కేటాయించాలని మంత్రి సత్య ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో నిర్మించిన మున్సిపల్ కాంప్లెక్స్‌లలో వ్యాపార సముదాయ కాంప్లెక్స్‌లలో వ్యాపారం చేసుకుని సాధికారత సాధించుకునే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రిజర్వేషన్ కోటాను దివ్యాంగులకు ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపులు కేటాయింపులో అవకాశం కల్పించాలని కోరుతూ రేపల్లె అరుణ శ్రీ వికలాంగుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు జానం మురళీకృష్ణ,అసోసియేషన్ ప్రతినిధులు,రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి విన్నవించుకున్నారు. దివ్యాంగుల అభ్యున్నతికి తోడ్పాటును అందించాలని, వినతి పత్రంలో సంఘ నాయకులు కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి ప్రభుత్వం దృష్టికి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యను సానుకూలంగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుణ శ్రీ వికలాంగుల సేవా సంక్షేమ సంఘం అధ్యక్షులు మురళీకృష్ణ సభ్యులు ఖాదర్ వలీ,ఓబులేశ్వరరావు,గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువ పరిశీలన

విశాలాంధ్ర - బాపట్ల : పిట్టలవానిపాలెం మండలం కోమలి శివారు మాచవరం నుంచి ఆర్మండ కాలువను ఇరిగేషన్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు శనివారం పరిశీలించారు. పంట పొలాలకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, టీడీపీ, జనసేన బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి ఓటర్ల జాబితాపై ఇంటింటి సర్వే

విశాలాంధ్ర - రేపల్లె : ఈనెల 20 నుంచి ఇంటింటికి ఓటరు జాబితాపై స్పెషల్ సమ్మరి రివిజన్ కార్యక్రమం నిర్వహించాలని రేపల్లె మండల తహసీల్దార్ మొర్ల శ్రీనివాసరావు అన్నారు. శనివారం సాయంత్రం రేపల్లె మండలం తహసీల్దార్ కార్యాలయంలో సమ్మరి స్పెషల్ రివిజన్ 2025లో భాగంగా రేపల్లె రూరల్ మండలంలోని బూతు లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20 నుంచి హౌస్‌టు హౌస్ సర్వే ప్రారంభమవుతుందని బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికి వెళ్లి సర్వే చేసి తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పట్టణ ఆర్.ఐ పెదలంక రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, బీఎల్వోలు పాల్గొన్నారు.

వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా సాగు

విశాలాంధ్ర - యద్దనపూడి : మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా పంటలను సాగు చేయాలని జిల్లా వనరుల కేంద్రం ఏడి ఏ.సయ్యద్ అక్బర్ హుస్సేన్ అన్నారు. మండలంలోని పూనూరు గ్రామంలో ఆత్మ ప్రకాశం వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమం ,పర్చూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్.మోహన్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తిలో రసం పీల్చు పురుగును సమగ్రవంతంగా నివారించడానికి అవలంబించాల్సిన పద్ధతులను,రైతులు పాటించాలని, లింగాకార బుట్టలను అమర్చడం వల్ల గులాబీ రంగు పురుగు ను గమనించి చేపట్టవలసిన నివారణ చర్యలు గురించి వివరించారు. మండల వ్యవసాయశాఖ అధికారి చల్లగుండ్ల నారాయణ పొలంబడి ద్వారా మేలైన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం బాపట్ల శాస్త్రవేత్త జె.రాధాకృష్ణ ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ సిహెచ్ అప్పారావు,శ్రీలక్ష్మి రైతులు అవగాహన కల్పించారు.

గిరిజనులకు దుస్తుల పంపిణీ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పేదలకు సహాయం చేయడంలోనే ఎంతో సంతృప్తిని ఇస్తుందని ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ గౌరవ అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు తెలిపారు.ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని పడమర పిన్నిబోయినవారిపాలెం కాలువకట్టపై నివసించే గిరిజన కుటుంబాలకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80 మంది గిరిజనులకు దుస్తులు పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.ఇప్పటికి వరుకు ఆపదలలో ఉన్న బాధితులకు ఒక్కొక్క కుటుంబానికి సహాయ సహకారాలు అందిస్తూ వచ్చామని,ప్రస్తుతం అధిక సంఖ్యలో గిరిజనుల కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేపట్టామన్నారు.ఆర్గనైజేషన్ కార్యదర్శి బత్తుల సురేష్ మాట్లాడుతూ కాలవ కట్టల వెంబడి ఉండే గిరిజన కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేస్తున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేస్తూ ముందుకు వెళ్తామని చెప్పారు.తాము నిర్వహించే కార్యక్రమాలకు సహాయ సహకారాలు చేసే ప్రతి ఒక్క సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బండ్రెడ్డి గోపి,జోగి సువర్ణరాజు, తన్నీరు గోపి,బండి శ్రీనివాసరావు, కందుల శ్రీకాంత్,యలవల శ్రీనివాసరావు,విన్నకోట శ్రీనివాసరావు,నరాలశెట్టి నాగరాజు, కె.సతీష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి కరిముల్లా చొరవ

విశాలాంధ్ర - నగరం (నిజాంపట్నం) : నగరం మండలంలోని చిన్నమట్లపూడి గ్రామంలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం విద్యార్థులకు సరిపోవడం లేదు. దీంతో తన సొంత గ్రామానికి ఏదో మంచి చేయాలనే ఉద్దేశంతో చిన్నమట్లపూడి టీడీపీ నాయకులు షేక్ కరిముల్లా సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. దానిలో భాగంగా పాఠశాల సమీపంలో ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసి నూతన పాఠశాల భవనం నిర్మించేందుకు ముందుగా తన వంతు సహాయంగా రూ.1 లక్ష రూపాయలను శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.స్థలం కొనుగోలుకు అలాగే నూతన పాఠశాల భవనం నిర్మాణానికి రూ.30 లక్షల రూపాయలను తన స్నేహితుల ద్వారా సేకరించి పనులు ప్రారంభించి పాఠశాల భవనం పూర్తి చేసి విద్యార్థులకు సౌకర్యవంతమైన వసతులు కల్పించడం జరుగుతుందని షేక్ కరీముల్లా తెలిపారు.తన సొంత గ్రామంలో ఇలాంటి మంచి పనులు చేయడంలో తాను కూడా భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషంగా ఉందని కరీముల్లా హర్షం వ్యక్తం చేశారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి :హక్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : వైద్యులకు రక్షణ కల్పించండి అంటూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బాపట్ల అధ్యక్షులు డాక్టర్ హక్ డిమాండ్ చేశారు. కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచార సంఘటన నిరసిస్తూ పట్టణంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిరసన ప్రదర్శన చేశారు.బాపట్ల కొత్త బస్టాండ్ నుంచి గడియార స్తంభం మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు నిరసన ప్రదర్శన కొనసాగించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ హక్కు మాట్లాడుతూ నిర్భయ లాంటి సంఘటనలు మరల ఈ దేశంలో జరగడం చాలా బాధాకరం అన్నారు.రాజకీయ నాయకులు ఎన్ని చట్టాలు చేసిన దానికి తగిన కార్యచరణ క్రింది స్థాయిలో జరగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపర్డెంట్ డాక్టర్ సిద్ధార్థ మాట్లాడుతూ వైద్యులుకు వైద్య సిబ్బందికి సరైన రక్షణ లేదన్నారు.నిద్రాహారాలు మాని ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించే వారిని బెదిరించడం భయపెట్టి మానభంగాలు చేయడం దారుణం అన్నారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్.విజయమ్మ మాట్లాడుతూ సమాజంలో కొంతమంది మృగాలు ఎలా పైశాచికంగా ప్రవర్తించి వైద్య విద్యార్థిని మరణానికి కారణమైనారు వారిని కఠినంగా శిక్షించాలని దేనిని సమాజంలో మేధావులు మానవతావాదులు ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జ్యోతి,డాక్టర్ విజయలక్ష్మి,డాక్టర్ శాంతి వైష్ణవి,డాక్టర్ సునీల్,డాక్టర్ సిహెచ్ మీనా,ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మధు సాల్మన్,ఫిజియోథెరఫీ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మధు,డాక్టర్ విద్యాసాగర్,డాక్టర్ అజ్మతుల్లా,డాక్టర్ టీవీ కోటేశ్వరరావు,డాక్టర్ యామిని చంద్ర,డాక్టర్ శ్రీకాంత్,డాక్టర్ చల్లా రామ్మోహన్ రావు,డాక్టర్ కేవీ మధు,రమేష్, మల్లికార్జున్,మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు అరికట్టాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని,హిందువుల మనోభావాలను కాపాడాలని కోరుతూ హిందూ ఐక్య సంఘాల సభ్యులు ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రమైన నిజాంపట్నంలోని బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు.అనంతరం తహసీల్దార్ షాకీర్ పాషా,ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి,ఎస్ఐ కెకె.తిరుపతిరావులకు హిందూ ఐక్య సంఘాల సభ్యులు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా హిందూ ఐక్య సంఘాల సభ్యులు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై మత మౌఢ్యంతో దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. దాడులకు పాల్పడుతున్న అల్లరి మూకలను కఠినంగా శిక్షించాలని చెప్పారు. హిందువులపై దాడులు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగించేలా ఐక్యరాజ్యసమితి ద్వారా ప్రపంచ దేశాలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ నిజాంపట్నం శాఖ చైర్మన్ కె.గౌరీ శంకర్,ఏపీ ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ హక్కుల పోరాట కమిటీ,గిరిజన ఐక్యవేదిక ఏపీ,టీఎస్ రాష్ట్రాల కన్వీనర్ ఊసవరపు వెంకటేశ్వర్లు, ఏపీ ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ హక్కుల పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు దిడ్ల హిమ కిరణ్,రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.చంద్రబాబు,ఎం.శ్రీనివాసరావు,మహేంద్ర గుప్తా,సురేష్,చందోలు నాగలక్ష్మి కుమారి,దిడ్ల నాగలక్ష్మి, చిన్ని చిట్టిబాబు, పి.సాంబశివరావు, కె.నాగమ్మ, ఎల్.భవాని, సజ్జా పద్మ,సజ్జా సోనాలి,కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బీఈసీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో 11వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగ జ్యోతి ప్రజ్వలన చేసి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కె.గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరం ముగించుకొని వెళుతున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఇంజనీరింగ్ విద్యార్థులు తమ నైపుణ్యాలను అంతర్జాతీయ ప్రమాణాలకు మించి,నేటి పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు.ప్రస్తుత అధునాతన ఇంజనీరింగ్ విభాగాలైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,మెషిన్ లెర్నింగ్,డాటా సైన్స్‌లో ఉన్న పరిశోధనా అవకాశాలను వివరించారు. ప్రత్యేకంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ భవిష్యత్తులో ఈ ప్రపంచం యొక్క ముఖచిత్రాన్ని సమూలంగా మార్చబోతుందని, ఆ రంగం యొక్క ప్రాముఖ్యతని,అందులో రానున్న వేలాది ఉపాధి అవకాశాలను గురించి విశదీకరించారు.బాపట్ల ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని సివిల్ ఇంజనీరింగ్,కంప్యూటర్ సైన్స్,మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాలు ఇటీవల ఎన్.బీ.ఎ (నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్) వారిచే అత్యున్నత ప్రమాణాలు గల విభాగాలుగా గుర్తింపు పొందాయని ప్రకటించారు. . సెక్రటరీ మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కాలం విలువను తెలుసుకోవాలని,ఇతర దుర్ వ్యసనాలకు దూరంగా ఉండాలని సలహా ఇచ్చారు.ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్ మాట్లాడుతూ బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ పరిశోధనాశాలలు,ఇతర అధునాతన సౌకర్యాలను గురించి వివరించారు. ఈ వేడుకలలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ గవర్నింగ్ బాడీ మెంబర్స్,వివిధ విభాగాల డీన్స్,అసోసియేట్ డీన్స్,వివిధ విభాగాధిపతులు,అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, ప్రస్తుత విద్యా సంవత్సరం ముగించుకొని వెళుతున్న విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు వితరణ

విశాలాంధ్ర-పర్చూరు: పేదరికంలో ఉన్న ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు రోటరీ ఆధ్వర్యంలో ప్రవాసాంధ్రుడు కొల్లా శ్రీనివాసరావు తన కుమారుడు సాకేత్ జన్మదినాన్ని పురస్కరించుకొని జ్ఞాపకార్థంగా ఒక్కొక్కటి రూ.57 వేలు విలువ చేసే ల్యాప్‌టాప్‌లను విద్యార్థులు రావినూతల భువనచంద్ర, పిల్లుట్ల సాయి సంజనకు సాకేత్ తాత, రోటరీ సభ్యులు నాగుబడి సుబ్బారావు విద్యార్థులకు అందించారు. రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి పేదరికం అడ్డుకారాదని, విద్యా లక్ష్యాలను ఎంచుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించిన శ్రీనివాసరావుకు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆంజనేయులు, సభ్యులు గడ్డిపాటి శ్రీనివాసరావు, నాగభైరు శ్రీనివాసరావు, వెంకటసుబ్బయ్య, సదానందరెడ్డి, సత్యనారాయణ, సుబ్బారెడ్డి, కాసా అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

విశాలాంధ్ర-పర్చూరు: ఏపీయూడబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్చూరు ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక నేతాజీ వృద్ధుల ఆశ్రమంలో పండ్లు, స్వీట్లు, బ్రెడ్‌ను పంపిణీ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కార వేదిక ఏపీయూడబ్ల్యూజే అని పలువురు జర్నలిస్టులు కొనియాడారు. కార్యక్రమంలో జర్నలిస్టులు కొమ్మాలపాటి రవికుమార్, కల్లేపల్లి రామకృష్ణంరాజు, కొండపాటూరి సుబ్బారావు, షేక్ అయూబ్, యడ్లపల్లి శామ్యూల్, బిరుదు నాగేశ్వరరావు ఉన్నారు.

పాస్ పోర్ట్ పోయినది

ఒంగోలు నగరంలోని ఓల్డ్ గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డు లోని అంకమ్మ పాలెంకు చెందిన **PERLA LIKHITH KRISHNA SAI,S/O KIRAN KUMAR**కు చెందిన **W2217778** నంబర్ గల పాస్ పోర్ట్ **11-8-2024** తేదీన ఒంగోలులోని ఏనుగు చెట్టు వద్ద గల మా స్నేహితుని ఇంటికి వెళ్లి వస్తుండగా మిస్ అయినది. ఎంత వెతికినను కనిపించలేదు. దొరికిన వారు తెచ్చి క్రింది అడ్రస్‌కు తెచ్చి ఇవ్వగలరు.

PERLA LIKHITH KRISHNA SAI
S/O KIRAN KUMAR
H. No. 36-1-168, Ankammapalem
Old Governament Hospital Road,
Ongole, A. P, INDIA, 523001
Cell. No. 8919322010.

నిందితులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-దర్శి : కోల్ కత్తా ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యు రాలిపై జరిగిన అత్యాచారం హత్యకు నిరసనగా భారతీయ వైద్య సంఘం ఐ.ఎం.ఏ ఒకరోజు బందుకు పిలుపునిచ్చింది. అందులో భాగంగా దర్శి ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సుమన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ డాక్టర్స్ వైద్య సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ప్రైవేట్ వైద్యశాలలు 24 గంటల పాటు వైద్య సేవలు బహిష్కరించి వైద్యురాలి అత్యాచారం హత్యకు సంతాపం తెలియజేయాలని ప్రైవేట్ వైద్యశాలల యాజమాన్యాలు నిర్ణయించాయి. ప్రభుత్వ వైద్యులు 2 గంటలు ఓపీలు నిలుపుదల చేసి యధాస్థితిగా వైద్య సేవలు కొనసాగిస్తున్నారు. ఎమర్జెన్సీ సేవలు మాత్రం కొనసాగుతాయని ప్రైవేటు వైద్యశాలల యాజమాన్యాలు తెలిపాయి. ఈ ధర్నాలో డాక్టర్స్ మాట్లాడుతూ కోల్ కత్తాలో డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేయడం చాలా దారుణమని వైద్యులు అంటే దేవుళ్ళని వాళ్లకే రక్షణ లేకపోతే సామాన్యులపరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారికి ఎంతటి వా వారినైనా కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాలను వైద్యులు డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో డాక్టర్స్ సుమన్, కోటిరెడ్డి, చేతన్, భాష, పూజ, బ్లెస్సి, గీత, పద్మ. ప్రభుత్వ ప్రైవేటు వైద్య సిబ్బంది భారీగా పాల్గొన్నారు.

హత్యాచారంపై నిరసన

విశాలాంధ్ర-బేస్తవారిపేట : కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారానికి నిరసనగా బేస్తవారిపేట ప్రాథమిక అరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి. పృథ్విరాజ్ ఆధ్వర్యంలో మండలంలోని ఆరోగ్య సిబ్బంది శనివారం బేస్తవారిపేటలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాథమిక అరోగ్య కేంద్రాల డాక్టర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో జూనియర్ డాక్టర్స్‌పై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నట్లు తెలిపారు. అనంతరం హత్యాచార ఘటనను నిరసిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్ర మంలో డాక్టర్ కావ్య, డాక్టర్ వర్శిని, డాక్టర్ రమేష్ కుమార్, డాక్టర్ లక్ష్మి జలేందర్, మండల వైద్య సిబ్బంది, యంఎల్ హెచ్ పీలు, హెల్త్ సూపర్ వైజర్లు, ఏయన్ యంలు, ఆశాలు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

అత్యాచారంపై డాక్టర్ల నిరసన

విశాలాంధ్ర-చీమకుర్తి : ట్రైనీ డాక్టర్ అత్యాచారాన్ని నిరసిస్తూ శనివారం చీమకుర్తిలో ప్రభుత్వ ప్రైవేటు వైద్యులు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. ర్యాలీలో పెద్ద ఎత్తున విద్యార్థినులు, మహిళలు, డాక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర నుంచి బస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో దోషులను అరెస్టు చేసి వెంటనే శిక్షించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీనియర్ వైద్యులు డాక్టర్ బి. జవహర్ మాట్లాడుతూ అర్ధరాత్రి వేళ డ్యూటీలో ఉన్న ట్రైనీ డాక్టరును కొంతమంది దుండగులు అత్యాచారం చేసి హత్య చేయటం ప్రజాస్వామ్య దేశంలో హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా వైద్యురాలు డాక్టర్ సురేఖ, స్థానిక జవహర్ నర్సింగ్ హోమ్ వైద్యురాలు డాక్టర్ బి. లక్ష్మీ శారద, మున్సిపల్ మాజీ చైర్మన్ కౌత్రపు రాఘవరావు, లయన్స్ క్లబ్ డైరెక్టర్ చలువాది రమేష్,సెక్రెటరీ ఎస్. అంజిరెడ్డి, మద్రి లక్ష్మీనారాయణ, గెలాక్సీ క్లబ్ అధ్యక్షులు ముత్యాల ప్రసాదు, లయన్స్ క్లబ్ ట్రెజరర్ సి.హెచ్.పార్థసారథి, మహిళా కార్యకర్త కాశమ్మ, టెక్స్టైల్ డిపార్ట్మెంట్ రాష్ట్ర మాజీ డిప్యూటీ డైరెక్టర్ కె చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు వినతి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఫ్లోరిన్ సమస్య ఉన్నందున ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, గత ప్రభుత్వంలో మంజూరైన జూనియర్ కళాశాల కొంతమంది రాజకీయ నాయకుల వలన రద్దయినదని దానిని తిరిగి మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకోగలరని, పాఠశాల చుట్టూ చిల్లచెట్లు,పిచ్చి మొక్కల వలన పాములు,విష సర్పాలు పాఠశాలలో సంచరించుటకు అవకాశం ఉన్నందున చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, విద్యుత్తు లైను సమస్యను తీర్చగలరని అనేక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అత్యవసరమని అది మంజూరు అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటానని హాస్టల్లో ఉండి చదువుతున్న బాలికలకు నా వంతు సహాయంగా ఒక పూట సన్న బియ్యంతో కూడిన భోజనం నా సొంత నిధులు వెచ్చించి భోజనం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా

విద్యార్థులతో చదువు మీద శ్రద్ధ వహించి చదివినట్లయితే మంచి ఫలితాలు సాధిస్తారని పాఠశాలను నియోజకవర్గంలో ప్రథమ స్థానంలో నిలపాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఎమ్మెల్యేకు ఇంఛార్జి ప్రిన్సిపాల్ దంపతులు ఇందిరా సుహాసిని, కత్తి తిరుపాల్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి గుర్రం పెద్దిరాజు,మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, గంటా శ్రీనివాసులురెడ్డి రైల్వే కాంట్రాక్టర్ బెంగళూరు,ఉప సర్పంచ్ కత్తి కిషోర్,ఎంపీటీసీ ఉడుముల సుబ్బారెడ్డి, గంగిరెడ్డి రమేష్ రెడ్డి,రెడ్డెం తిరుపతిరెడ్డి,బూసి రామకోటి రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

108లో ప్రసవం..తల్లి బిడ్డ క్షేమం

విశాలాంధ్ర-దొనకొండ: మార్గ మధ్యంలోనే 108లో ప్రసవంతో తల్లికి బిడ్డ జన్మించిన సంఘటన శనివారం జరిగింది. సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మంగినపూడి గ్రామానికి చెందిన కె.మరియమ్మ ప్రసవ వేదనతో ఉండగా 108 వాహనంలో మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా నొప్పులు అధికం అయ్యాయి. దీంతో వాహనంలోనే ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ బాలజ్యోతి సుఖ ప్రసవం చేశారు. అనంతరం వారిని వైద్యశాలకు తరలించారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉండటంతో పైలట్ ప్రసాదరావును, బాలజ్యోతిని 108 మేనేజర్ విజయ్‌కుమార్, పొదిలి డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ రాజేంద్రప్రసాద్, మరియమ్మ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

ప్రశాంతంగా పాఠశాలల మేనేజమెంట్ కమిటీల ఎన్నికలు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : ఈ నెల 8న జరిగిన పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో భాగంగా ఏడు పాఠశాలలకు కోరం లేక ఎన్నికలు నిలిచాయి. శనివారం ఐదు పాఠశాలలకు ఏకగ్రీవంగా ఎన్నికలు జరగగా, వద్దిమడుగు యుపి పాఠశాల నాగంపల్లి ఏపి పాఠశాలలకు కోరం లేక ఎన్నికలు వాయిదా పడినట్లు ఎంఈఓ-2 బి నరసింహారావు తెలిపారు. చౌటుపల్లి ఏ ఏపాఠశాల మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్‌గా సిహెచ్ రాజ్యం, వైస్ చైర్మన్‌గా అనిత, పేరారెడ్డిపల్లి పాఠశాల కమిటీ చైర్మన్‌గా పి వెంకట సుబ్బారెడ్డి, వైస్ చైర్మన్‌గా కృపమ్మ, చింతకుంట్ల ఏపి పాఠశాల చైర్మన్‌గా సిహెచ్ చిన్నక్క, వైస్ చైర్మన్ బి సుధాకర్, చేరెడ్డి వారి పల్లి పాఠశాల చైర్మన్గా సిహెచ్ ఓబులమ్మ వైస్ చైర్మన్‌గా కోటేశ్వరరావు చింతకుంట హెచ్ది పాఠశాలకు పి రాజయ్య వైస్ చైర్మన్‌గా కాసింలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి మండలం గాడిపర్తివారి పాలెం గ్రామంలో వున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, రంగసాయిపురంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్కూల్ నిర్వహణ కమిటీ ఎన్నిక కార్యక్రమం గతంలో ఆగిపోయింది. దీంతో శనివారం ఎన్నికల నిర్వహించారు. అన్ని పాఠశాలలో పాలకవర్గంను ఎన్నుకోవడం జరిగింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చైర్మన్‌గా పైడిపాగా దావీదు, వైస్ చైర్మన్‌గా కళ్లేపల్లి శకుంతలని ఎన్నుకోవడం జరిగింది. గాడిపర్తివారిపాలెం ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా చల్లకొలుసుల ఆంజనేయులు, వైస్ చైర్మన్‌గా ఇమ్మడిశెట్టి అమరేశ్వరి లను ఎన్నుకోవడం జరిగింది.రంగసాయిపురం ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా గండి అనూష,వైస్ చైర్మన్ గా పైడిపాగా మల్లేశ్వరిలను ఎన్నుకోవడం జరిగింది. హై స్కూల్ హెడ్ మాస్టర్ పి.ఎన్.జి. రంగారావు రావు,ఎంపీపీ స్కూల్ గాడిపర్తివారిపాలెం స్కూల్ హెడ్ మాస్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-దర్శి : డీఎస్పీ లక్ష్మీనారాయణను టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి, పుష్పగుచం అందజేశారు. డిఎస్పీని కలిసిన వారిలో దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ యువనాయకులు దారం సుబ్బారావు, కొట్టె మల్లి, సీనియర్ నాయకులు సంగు కొండలు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పుల్లలచెరువు చిన్నా, నియోజకవర్గ ఐ.టిడిపి అధ్యక్షులు యస్.వి.రామయ్య,, తెలుగు యువత ఉపాధ్యక్షులు కల్లూరి సుబ్బు తదితరులు ఉన్నారు.

సీఐ సురేష్‌కు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-గిద్దలూరు : గిద్దలూరు అర్బన్ నూతన సీఐగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సురేష్‌ని శనివారం వారి కార్యాలయంలో గిద్దలూరు నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, కౌన్సిలర్స్, టీడీపీ నాయకులు పెద్దవలి, బిళ్ళ రమేష్ యాదవ్, షేక్షావలి, గర్రే సుబ్బారావు, పాముల శ్రీకాంత్ యాదవ్‌లు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందచేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-బేస్తవారిపేట : విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని కంభం సెబ్ సీఐ బాలకృష్ణ సూచించారు. స్థానిక యశ్వంత్ ఉన్నత పాఠశాలలో శనివారం మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్తు నాశనం చేసుకోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ కర్నాటి గౌరీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ అమూల్యమైన సమాచారాన్ని విద్యార్థులకు అందించినందుకు సిఐకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విజన్ బాపట్లపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలి

కలెక్టర్ బి.సుబ్బారావు

విశాలాంధ్ర - బాపట్ల : విజన్ బాపట్లపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. వికసిత్ ఆంధ్ర కార్యక్రమంపై అన్ని శాఖల జిల్లా అధికారులకు ఒక రోజు వర్క్ షాప్ శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. ప్రజల తలసరి ఆదాయం పెరిగేలా సహజ వనరుల సద్వినియోగంపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ చెప్పారు. అభివృద్ధి పెరుగుదల ఉండాలని, లక్ష్యాలను చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. పెరుగుతున్న జనాభాకు తగినట్లుగా భవిష్యత్తులో ఉత్పత్తి రంగాల ఉత్పాదకత ఉండేలా చూడాలన్నారు. ఇందుకోసం విజన్ బాపట్ల ఉండాలని వివరించారు. భావితరాలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని దెవలప్ ఇండియా మిషన్ లక్ష్యంతో కేంద్రం ముందుకు వెళ్తుందన్నారు. జిడిపిలో భారత్ 3.9 ర్యాంక్‌తో ప్రపంచంలో ఐదవ స్థానంలో ఉందన్నారు. జిడిపిలో ఆంధ్రప్రదేశ్ 2.19 శాతం ఉందన్నారు. 2030 నాటికి సుస్థిరాభివృద్ధి, 2047వ సంవత్సరానికి జిడిపి పెరుగుదలతో భారత మూడో స్థానానికి చేరడమే లక్ష్యమన్నారు. ఆహార కొరత ఏర్పడటంతో 1950లో ఆనాటి ప్రభుత్వం,అప్పటి అధికారులు కలిసి పంచవర్ష ప్రణాళికను ప్రవేశపెట్టడంతో భారత్ అభివృద్ధి బాటలోకి వచ్చిందన్నారు.గత అనుభవాలు,భవిష్యత్తు అవసరాలను పరిగణనలోకి తీసుకుని భావితరాలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేయాలని మార్గ నిర్దేశం చేశారు. బాపట్ల జిల్లా జిడిపి పెరగాలంటే సాంఘిక సంస్థాగత అభివృద్ధికి సదుపాయాలు సమకూర్చాలని జిల్లా సంయుక్త కలెక్టర్ చెప్పారు. ఆర్థిక వ్యవస్థ మెరుగుపడాలంటే సమగ్ర ప్రణాళిక ఉండాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తుల భాగస్వామ్యంతో అభివృద్ధికి బాటలు వేసేలా ప్రణాళిక చర్యలు ఉండాలన్నారు. ప్రస్తుతం బాపట్ల జిల్లా ఆదాయ వృద్ధి రూ. 36,577 కోట్లు ఉందన్నారు.జిల్లా వ్యవసాయ రంగంలో ఆదాయం 56.09 శాతం కాగా,పరిశ్రమల ఆదాయ 16.10 శాతం, ఉండగా సర్వీస్ సెక్టార్లలో ఆదాయం 27.81 శాతం ఉందన్నారు. మొత్తంగా బాపట్ల జిల్లా అభివృద్ధి రేటు 7.59శాతంగా ఉండగా,రాష్ట్రంలో జిల్లా ఉత్పత్తి ఆదాయం 2.81శాతంగా ఉందన్నారు. సంవత్సరంలో వృద్ధిరేటు 15శాతానికి చేరుకోవాలన్నారు. ప్రతి ఏటా జిల్లా ఆదాయం వృద్ధి 15 శాతానికి చేరుకోవాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఒక వ్యక్తికి ఏడాది తలసరి ఆదాయం రూ. 1,96,853లు ఉందన్నారు. వస్తువుల ఉత్పత్తి, ఉత్పాదకత, వనరులు, అవకాశాలపై ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన స్పష్టం చేశారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తే ఆర్థిక వ్యవస్థ మరింత మెరుగుపడుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - బాపట్ల : మహిళ శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగాల భర్తీకి పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. స్త్రీ,శిశు సంక్షేమ శాఖలో ప్రత్యేక దత్తత ఏజెన్సీ కింద ఎనిమిది ఉద్యోగా లకు, వన్ స్టాప్ సెంటర్ (సఖి) కింద ఏడు ఉద్యోగాలకు శనివా రం స్థానిక కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు జరిగాయి. జిల్లాస్థాయి ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్వ్యూలకు ప్రత్యేక దత్తత ఏజెన్సీ కింద మొత్తం 104 దరఖాస్తులు రాగా,9 0 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూ కు హాజరయ్యారు.14 మంది గైర్హాజరయ్యారన్నారు. వన్‌స్టాప్ సెంటర్ (సఖి) కింద మొత్తం 69 దరఖాస్తులు రాగా,57 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని, మిగిలిన 12 మంది గైర్హాజరు అయ్యారన్నారు. అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, మహిళా సంక్షేమ శాఖ పీడీ కె.ఉమా,డీడీ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాజా దిబోరా, గుంటూరు సీడబ్ల్యూసీ చైర్మన్, సీడబ్ల్యూసీ సభ్యుడు, ఒంగోలు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు తెలుగు మహిళా నాయకులు వితరణ

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలోని అంబేద్కర్ పార్కులో శుక్రవారం రాష్ట్రమంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభించిన అన్న క్యాంటీన్ నిర్వహణకు టిడిపి తెలుగు మహిళ ప్రతినిధులు విరాళాలను రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని ప్రసాద్‌కు అందజేశారు. మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ చేతుల మీదుగా పునఃనిర్మాణం చేసిన అన్న క్యాంటిన్‌కు తెలుగుదేశం పార్టీ రేపల్లె పట్టణ మహిళా అధ్యక్షురాలు గోరీ రమకుమారి రూ. 50,000,రేపల్లె సురేష్ రూ. 25,000,యలవర్తి లక్ష్మి రూ. 5000లు విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్న క్యాంటీన్ నిరంతరాయంగా కొనసాగేందుకు దాతలు పుర ప్రముఖులు ప్రజలు విరాళాలుగా అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. విరాళాలు అందజేసిన టిడిపి తెలుగు మహిళ ప్రతినిధులకు నాయకులకు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే 67వ వార్షికోత్సవం

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఏపీయూడబ్ల్యూజే 67వ వార్షికోత్సవ వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. శనివారం ఒంగోలు, మార్కాపురం, ఎర్రగొండపాలెం, దర్శి, గిద్దలూరు తదితర ప్రాంతాల్లో వార్షికోత్సవ సందర్భంగా వృద్ధులకు, అనాథ పిల్లలకు అన్నదానం, బట్టలు, పండ్లు, బెడ్లు, వంటివి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఒంగోలులోని బ్లైండ్ అనాథ పిల్లలకు అన్నదాన కార్యక్రమం సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అలుగుల సురేష్ మాట్లాడుతూ 1957 ఆగస్టు 17న హైదరాబాద్ జూబిలీ హాల్‌లో భారతీయ పత్రికారంగ పితామహులలో ఒకరు, వర్కింగ్ జర్నలిస్ట్ కార్మికోద్యమ నేత, తెలుగు తేజం, మానికొండ చలపతిరావు చేతులమీదుగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భవించిందని తెలిపారు. పత్రికా స్వేచ్ఛ, పాత్రికేయుల హక్కులు, మెరుగైన పని పరిస్థితులు, వేతన భద్రత, పాత్రికేయుల భద్రత, వృత్తి ప్రమాణాల వృద్ధి, వంటి ఆశయాలతో ఏపీయూడబ్ల్యూజే ఏర్పడిందని దీనిలో భాగంగా అనేక హక్కులను సాధించామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్న ఏకైక సంఘం ఏపీయూడబ్ల్యూజే అని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందిస్తాయని ఆశ భావన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి డి కనకయ్య మాట్లాడుతూ జర్నలిస్టు సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటం చేస్తున్న ఏపీయూడబ్ల్యూజే 67 వార్షికోత్సవ దినోత్సవాన్ని అంధ విద్యార్థులు మధ్య జరుపుకోవడం ఆనందాన్ని కలిగించిందన్నారు. 30 మంది జర్నలిస్టులతో ఏర్పడిన సంఘం ఈరోజు 30 వేల మంది జర్నలిస్టుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తూ జర్నలిస్టులకు సాధనలో అనేక విజయాలు సాధించామన్నారు. ముఖ్యంగా బ్లైండ్ విద్యార్థులకు ఏపీయూడబ్ల్యూజే అండగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో జర్నలిస్టులు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కొత్తగా ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ ఎలక్ట్రాన్ మీడియా జిల్లా అధ్యక్షులు బి. వెంకటరావు మాట్లాడుతూ 67 సంవత్సరాలుగా ఏపీయూడబ్ల్యూజే జర్నలిస్టుల సమస్యల కోసం చేస్తున్న పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్తులో జర్నలిస్టులకు ఏపీయూడబ్ల్యూజే ఉంటుందని తెలిపారు. జర్నలిస్టులు సేవా కార్యక్రమంలో పాల్గొని వారి అండగా ఉండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి శంకర్ ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు ఐజేయు కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసరావు ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ ఏపీయూడబ్ల్యూజే వైస్ ప్రెసిడెంట్ హెచ్చేకర్ భాష సీనియర్ ఫోటోగ్రాఫర్ యూనియన్ నాయకులు సర్వేశ్వరరావు సుబ్బారావు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - బాపట్ల : ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఆధ్వర్యంలో 67వ ఆవిర్భావ దినోత్సవం బాపట్లలోని బదిరుల ఆశ్రమ పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం విద్యార్థులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు సలగల రాజశేఖర బాబు,బిజెపి జిల్లా అధ్యక్షులు ఎడ్లపాటి లక్ష్మీనారాయణ,జనసేన బాపట్ల నియోజకవర్గ సమన్వ యకర్త నామన శివన్నారా యణ, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి మానవ విజేతతో,జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చెన్నుపాటి రాంబాబు, గొర్ల శ్రీనివాసరావు, ఐజేయు కౌన్సిల్ సభ్యులు ఘట్టమనేని సురేష్ కుమార్, ఉపాధ్యక్షులు దుర్గాప్రసాద్, గౌరవ అధ్యక్షులు కోట ఉమా మహేశ్వరరావు, గణేష్ , ధనరాజ్, ప్రశాంత్, స్టాలిన్, లక్ష్మీనారాయణ, చిక్కాల కొండలరావు, సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి సహకరించాలి

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథార్టీ ఆదేశాల మేరకు రాష్ట్ర హైకోర్టు వారు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు సెప్టెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్ నందు సత్వర కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు, సిబ్బంది సహకరించాలని రేపల్లె కోర్టు సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక న్యాయస్థానం భవనంలో రేపల్లె పట్టణ రూరల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లో ఎస్సైలు, ఏఎస్సైలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్, బ్యాంకు వివాదాలు, లావాదేవీలు, రవాణా,పెట్టీ కేసులు,రాజీ పడదగిన కేసులను అదాలత్లో పరిష్కారం అయ్యే విధంగా కోర్టు కానిస్టేబులు, పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, సిబ్బంది సహకరించాలని గతంలో కన్నా మిన్నగా కేసులు పరిష్కా అయ్యేవిధంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేపల్లె పట్టణ ఎస్సై హరిబాబు, నిజాంపట్నం ఎస్సై తిరుపతిరావు, బట్టిపోలు, నగరం, చెరుకుపల్లి, అడవులదీవి, చోడాయిపాలెం, ఎస్సైలు,స్టేషన్ సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.